సంపుటి - 5 డిసెంబర్ - 2021 సంచిక-6

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక

తండ్రి గారి సందేశం............................................3

ఇమ్మానువేలు-మానవులతో పాటు ఉంటడానికి ఇష్టపడే దేవుడు ..6

అబ్రహాము బలి ఇచ్చాడా?......................................8

బైబిల్ దర్శనం ..................................................10

పునీత ఫ్రాన్సిస్ జేవియర్ (శౌరి) ................................13

శుభవచనం బైబిల్ క్విజ్.......................................15

ఇంద్రధనుస్సు.....................................................17

ఏంజెల్స్ కార్నర్...................................................18

యువస్పందన.......................................................19

బైబిల్ దృశ్యమాలిక.............................................21

శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు..........................23







**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**

**సంపాదక వర్గం**

ఫాదర్ సిజో — ఫాదర్ ప్రిన్స్

సిస్టర్ హృదయ ASMI — సిస్టర్ క్రిస్టీన CMC

Mr. M. సత్యం — Mr. J. లూర్దు స్వామి

Mrs. K. శ్రీలత — Mr. కిరణ్ కుమార్ రెడ్డి

**టైపింగ్ సహకారం** – D. ప్రిన్సి

**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
**మంచిర్యాల- 504 208**
**మంచిర్యాల జిల్లా**
**తెలంగాణ**

**Cell: 09398764408**

**Email ID - jeevaswarammagazineadb@gmail.com**

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

**"ఏలయన, మనకొక శిశువు జన్మించెను.**
**మనమొక కుమారుని బడసితిమి. అతడు**
**రాజ్యభారము వహించును. 'ఆశ్చర్యకరుడు,**
**సలహాదారుడు, బలాఢ్యుడైన దేవుడు, శాశ్వతుడైన**
**జనకుడు, శాంతికరుడైన రాజు'**
**అని అతడికి పేరిడుదురు".**
**(యెషయా 9,6).**

| సెప్టెంబర్ నెల<br>శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు | సెప్టెంబర్ నెల<br>ఇంద్రధనుస్సు విజేతలు |
|---|---|
| మొదటి బహుమతి | మొదటి బహుమతి |
| సిస్టర్. జియో సి.ఎమ్.సి, మంచిర్యాల | బి. ఆదిత్య, ఇంద్రవెల్లి |
| రెండవ బహుమతి | రెండవ బహుమతి |
| ఎన్. రసిక, డోంగ్రా గావ్ | డి. ఆల్ఫీ, మంచిర్యాల |
| మూడవ బహుమతి | మూడవ బహుమతి |
| టి. విజయ్, విజయనగరం | డి. అనుస్వేత, మంచిర్యాల |
| బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి | బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి |

# తండ్రి గారి సందేశం....



## క్రిస్మస్ - దేవుడు మన మధ్యలో ఉన్నాడని గుర్తు చేసే పండుగ

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

అత్యంత ఉత్సాహంతో, అపరిమిత ఆనందముతో చిన్నారి బాలయేసుని రాకడ కోసం మనం ఎదురుచూసే రోజులు ఇవి. "ఇదిగో! కన్య గర్భము ధరించి ఒక కుమారుని కనును. ఆయనను 'ఇమ్మానుయేలు' అని పిలిచెదరు" అని ప్రవక్తతో ప్రభువు పలికినది నెరవేరునట్లు ఇదంతయు సంభవించెను. "ఇమ్మానుయేలు" అనగా "దేవుడు మనతో ఉన్నాడు" అని అర్థము (మత్తయి 1,22-23). దేవుడు నివసించేది పైనున్న ఆకాశములో కాదు కాని, మన మధ్యలలోనే అనేది క్రిస్మస్ పండుగ యొక్క అతి ముఖ్యమైన సందేశం. ఏదేను తోటలో ఆదిమ తల్లిదండ్రులతో పాటు తిరుగుతున్న దేవుని మనం చూస్తున్నాము (ఆది 3,8). పగలు దారి చూపు మేఘ స్థంభముగాను, రాత్రి వెలుగు నిచ్చు అగ్ని స్థంభముగాను ప్రభువు ఇస్రాయేలీయుల ముందు నడిచినట్టు నిర్గమ కాండములో మనం చదువుతున్నాము. తాను ఎన్నుకొన్న ఇస్రాయేలు ప్రజలను ముందు నుండి నడిపించి, వారి మధ్యలోనే గుడారములో నివసిస్తున్న దేవుని మనం చూస్తున్నాము. ఇలా ఆదికాండము మొదలుకొని దర్శనగ్రంథం వరకు మనం చదివితే, మానవుల మధ్యలో నివసించడానికి ఇష్టపడే దేవుని మనం కనుగొనవచ్చు. పవిత్ర గ్రంథములో మనం కనుగొనిన ఈ దేవుని స్వభావానికి అతి పెద్ద రుజువు క్రిస్మస్ పండుగ.

దేవుడు లోకమును ఎంతో ప్రేమించి తన ఏకైక కుమారుని ప్రసాదించిన రోజు ఇది (యోహాను 3,16). రెండువేల సంవత్సరాల క్రితం యేసు ప్రభువు ఈ లోకములో మానవునిగా అవతరించి అన్ని విధాలుగా మానవునిగా జీవించి, అన్ని విధాలుగా శోధింపబడి, మరణించి, పునరుత్థానుడై ఈ రోజు కూడా మనతో పాటు నివసిస్తున్నాడు అనేది గొప్ప సత్యం. "ఇదిగో లోకాంతము వరకు నేను మీతో నుందును" (మత్తయి 28,20) అని ప్రభువే మనకు సెలవిస్తున్నాడు.

దేవుడు మనతో జీవించడం అనేది కాదనలేని సత్యం అని పవిత్ర గ్రంథం మనకు సాక్ష్యం ఇస్తుంది. ఈ రోజులలో కూడా దేవుని శక్తివంతమైన హస్తాన్ని, ఆయన సాన్నిధ్యాన్ని ఎన్నో విధాలుగా మనం దర్శిస్తున్నాము. ఈ క్రిస్మస్ పండుగను అర్థవంతమైన విధములో మనం కొనియాడలంటే, దేవుడు మనతో పాటు నివసించే సత్యాన్ని తెలుసుకుంటూ, మనతో పాటు నివసించే దేవుని మనం మన హృదయ కోవెలలోకి ఆహ్వానించాలి. నా కుడిచేతిని పట్టుకొని దేవుడు నన్ను నడిపిస్తున్నాడని మనం విశ్వసించాలి (యెషయా 41,13). ఆ విశ్వాసం మనకు ధైర్యాన్ని ఇస్తుంది. తమలో దేవుని సాన్నిధ్యం అనుభవించేవారు గొప్ప కార్యములు చేయగలుగుతారు.

మానవ దృష్టిలో అత్యల్పుగా ఉన్నవారు, తమలో దేవుని సాన్నిధ్యం తెలుసుకొన్న తరువాత ఆ విశ్వాసముతో చేసిన గొప్ప కార్యముల చరిత్రే పరిశుద్ధ గ్రంథం.

ఒక గొప్ప జనసమూహమును ఎడారిలో 40 సంవత్సరాలు నడిపించడానికి బండనాలుక వలన తడవుకొనుచు మాట్లడుతున్న మోషేకు సాధ్యమైదంటే తప్పకుండా ఆయన దేవుని సాన్నిధ్యం తెలుసుకొని ఉండవచ్చు. సమూవేలు మొదటి గ్రంథములో 17వ అధ్యాయంలో మహా శూరుడైన గొలియాతును ఎదురుకోవడానికి ధైర్యముతో వెళ్తున్న దావీదును మనం చూడవచ్చు "నీవు కత్తి, యీటె, బాకు గైకొని నా మీదికి వచ్చితివి. కాని నేను సైన్యములకు అధిపతియైన యావే దేవుని పేర, నీ మీదికి వచ్చితిని" (1 సమూవేలు 17,45) అని పలికిన దావీదు రాజు విశ్వాసం మనం సొంతం చేసుకోవాలి. "గాఢాంధకారపు లోయలలో పయనించినప్పుడును నేనెట్టి అపాయమునకును భయపడను" (కీర్తన 23,4). అని దావీదు పాడినట్లు మనం చదువుతున్నాము. "శత్రువులు వారి ఆయుధముల మీదను, సాహసము మీదను ఆదారపడవచ్చునేమోకాని, మనము మాత్రము సర్వోన్నతుడైన దేవుని మీద ఆధారపడవలసిన వారము" (2 మక్కాబీయులు 8,18) అని దృఢంగా చాటి చెప్పి గొప్ప సైన్యములతో దండెత్తి వస్తున్న నికానోరు రాజును ఎదురుకొన యూదా మక్కబీయునుకు సైతం దేవుని సాన్నిధ్యము ధైర్యముగా మారింది.

యేసు ప్రభుని సాన్నిధ్యము ఇచ్చే ధైర్యముతో లోకపు నలుమూలలలో సువార్త వ్యాప్తి చేసిన అపోస్తులులు, యేసయ్య కోసం ప్రాణాన్నే త్యాగం చేసిన హతసాక్షులు, లోకసుఖాలను విడిచిపెట్టి యేసయ్య సాన్నిధ్యమే చాలని నమ్మి ఒంటరిగా జీవించిన పుణ్యపురుషులు. ఇలా అనేక మంది ప్రభుని కోసం తమ స్వంత జీవితాలనే బలిగా అర్పించిన వారు మన మధ్యలోనే జీవించి ఉన్నారు. వీరందరు మన జీవితములో యేసయ్య సాన్నిధ్యం ధైర్యముగా మారుతుందని నేర్పిస్తున్నారు. ఈ క్రిస్మస్ పండుగ ద్వారా దేవుని సాన్నిధ్యాన్ని గ్రహించి, ఆయనను మన అనుదిన జీవితములో అనుభవించి మన జీవితాలను దేవుని కార్యాలకు ఒక వేదికగా మార్చుకోవడానికి సిద్ధపడుదాం.

**మీకందరికి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు.**

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు



| అక్టోబర్ నెల<br>శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు | అక్టోబర్ నెల<br>ఇంద్రధనుస్సు విజేతలు |
|---|---|
| మొదటి బహుమతి | మొదటి బహుమతి |
| ఎమ్. రాధ, ఆదిలాబాద్ | ఎ. తేజస్విని, సిర్పూర్ |
| రెండవ బహుమతి | రెండవ బహుమతి |
| ఎమ్. సుంధర్, ఇంద్రవెల్లి | బి. ఎంజెల్, మంచిర్యాల |
| మూడవ బహుమతి | మూడవ బహుమతి |
| ఓ. దీపా, మంచిర్యాల | బి. అనీత, మంచిర్యాల |
| బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి | బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి |

## శుభవచనం బైబిల్ క్విజ్‌లో పాల్గొనే వారందరికి శుభవార్త

2021 జనవరి నెల నుండి క్రొత్త సిరీస్‌ను ప్రారంభించాము.
మే, జూన్ నెలలలో మాసపత్రిక ప్రచురింపబడలేదు.

1. ప్రతి నెల అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి నెల చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి.
2. ప్రతి నెల క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేరు మరియు మార్కులు వ్రాసి ఉంచుతాము. ఇలా అన్ని నెలలు క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి సంవత్సరం చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి. మొదటి బహుమతి రూ।। 10,000/-లు, రెండవ బహుమతి రూ।। 8,000/-లు, మూడవ బహుమతి రూ. 6,000/- సంవత్సరములోని అన్ని పరీక్షలలో పాల్గొన్నవారికి ప్రోత్సహక బహుమతులు ఇవ్వబడుతాయి.

**మీరు ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాము.**



## ఇమ్మానువేలు – మానవులతో పాటు ఉంటడానికి ఇష్టపడే దేవుడు

1). "నీవు భయపడకుము, నేను నీకు తోడై యుందును. నీవు వెరువకుము, నేను నీకు దేవుడను. నేను నీకు బలము నొసగి నిన్ను ఆదుకొందును. నా శక్తితో నిన్ను కాపాడుదును" (యెషయా 41,10)

2). "మీరు ధైర్యస్థైర్యములను అలవరచుకొనుడు. మీరు వారిని చూచి భయపడవలదు. అధైర్యము చెందవలదు. ప్రభువు మీకు బాసటయై ఉండును. ఆయన మిమ్ము చేయి విడుచువాడు కాదు" (ద్వితీ 31,6)

3). నీ దేవుడైన ప్రభువు నీ నడుమ నున్నాడు. ఆయన బలము వలన నీకు విజయము కలుగును. ఆయన నిన్ను గాంచి ఆనందించును. ప్రేమతో నీకు నూత్నజీవము ఒసగును. నిన్ను తలంచుకొని సంతసముతో పాటలు పాడును" (జెఫన్యా 3,17)

4). "గాఢాంధకారపు లోయలో పయనించునపుడును నేనెట్టి అపాయమునకు భయపడను. ఎందుకన నీవు నాకు తోడుగా నుందువు. నీ రాజదండము, నీ చేతి కఱ్ఱ నన్ను కాపాడుచుండును" (కీర్తన 23,4)

5). "ఇదిగో కన్య గర్భము ధరించి ఒక కుమారుని కనును. ఆయనను 'ఇమ్మానువేలు' అని పిలిచెదరు. అని ప్రవక్తతో ప్రభువు పలికినది నెరవేరునట్లు ఇదంతయు సంభవించెను. 'ఇమ్మానువేలు' అనగా 'దేవుడు మనతో ఉన్నాడు' అని అర్థము" (మత్తయి 1,23)

6). "నీవు భయపడవలదు. దిగులు పడవలదు. ప్రభువు నీ చేయి విడువడు. ఆయన నీకు నాయకుడగును. నీకు తోడుగా ఉండును" (ద్వితీ 31,8)

7). "ఆ వాక్కు మానవుడై మన మధ్య నివసించెను. మేము కృపా సత్యముతో నిండిన ఆయన మహిమను చూచితిమి. అది తండ్రి యొద్ద నుండి వచ్చిన ఏకైక కుమారుని మహిమ" (యోహాను 1,14)

8). "సరే వినుడు. ప్రభువే మీకొక గుర్తును చూపించును. యువతి గర్భవతియై ఉన్నది. ఆమె కుమారుని కని అతనికి ఇమ్మానువేలు అని పేరు పెట్టును" (యెషయా 7,14)

9). "సింహాసనము నుండి ఒక గంభీరధ్వని వెలువడుట నేను వింటిని. 'ఇక దేవుడు మానవులతోనే నివసించును! ఇక ఆయన వారితోనే నివసించును! వారే ఆయన ప్రజలు. స్వయముగ దేవుడే వారితో ఉండును. ఆయన వారికి దేవుడగును" (దర్శన 21,3)

10). "ఏలయన, ఎక్కడ ఇద్దరు లేక ముగ్గురు నా పేరట కూడుదురో అక్కడ నేను వారి మధ్య ఉన్నాను" అనెను (మత్తయి 18,20)

11). "నీ దేవుడను, ప్రభువునైన నేను నీకు బలమును ఒసగుదును. 'నీవు భయపడకుము. నేను నిన్నాదుకొందున'ని నీతో చెప్పుచున్నాను. నేను నీ కుడిచేతిని పట్టుకొందును" (యెషయా 41,13)

12). "విశ్వాసము వలన క్రీస్తు మీ హృదయముల యందు నివాస మేర్పరచుకొనును గాక అనియు ప్రార్థించు చున్నాను" (ఎఫెసీ 3,17)

13). "నేను మీకు ఆజ్ఞాపించిన దంతయు వారు ఆచరింప బోధింపుడు. ఇదిగో లోకాంతము వరకు సర్వదా నేను మీతో నుందును" అని అభయ మొసగెను (మత్తయి 28,20)

14). ''నేను చెప్పినట్లు ధైర్యస్థైర్యములు అవలంబింపుము. నిర్భయముగా నిస్సంశయముగా ప్రవర్తింపుము. నీ దేవుడైన ప్రభువు ఎల్లవేళల నీతో ఉన్నాడు" (యెహోషువ 1,9)

15). ధనాపేక్ష నుండి మీ జీవితములను దూరముగ ఉంచుకొనుడు. ఉన్న దానితో తృప్తిచెందుడు. ఏలయన, 'నేను మిమ్ము ఎప్పుడు విడువను. ఏనాటికి ఎడబాయను' అని దేవుడు చెప్పెను" (హెబ్రీ 13,5)

16). "మీరు దేవుని ఆలయమని, దేవుని ఆత్మకు నివాసమని మీకు తెలియదా?" (1 కొరింతీ 3,16)

17). "వినుము! నేను ద్వారము వద్ద నిలిచి తలుపు తట్టుచున్నాను. ఎవరైనను నా స్వరమును విని తలుపు తెరచిన లోనికి వత్తును. వానితో భుజింతును. అతడును నాతో భుజించును" (దర్శన 3,20)

18). "ఆయన తనకు మొరపెట్టువారికి చేరువలోనే ఉండును. చిత్తశుద్ధితో ప్రార్థన చేయువారికి దాపులోనే యుండును" (కీర్తన 145,18)

19). "మహోన్నతుని పవిత్ర మందిరమును దేవుని నగరమును, తన పాయలతో ఆనందమును ఓలలాడించు నది ఒకటి కలదు" (కీర్తన 46,4)

20). "దేవుడు లోకమును ఎంతో ప్రేమించి, తన ఏకైక కుమారుని ప్రసాదించెను. ఆయనను విశ్వసించు ప్రతివాడును నాశనము చెందక నిత్యజీవమును పొందుటకై అట్లు చేసెను" (యోహాను 3,16)





# అబ్రహాము బలి ఇచ్చాడా?

దేవుడు అబ్రహామును బలి ఇమ్మని కోరినప్పుడు, దేవుడు అలా అడిగిన తరువాత కాదంటే ఏమౌతుందో తెలిసిన వ్యక్తిగా, దేవుని మనసును ఎరిగిన వ్యక్తిగా దేవుడు అలా అడగడం న్యాయమో, అన్యాయమో తెలియకపోయిన, దేవుడు మంచినే చేస్తాడు అని తెలిసిన వ్యక్తిగా పూర్తిగా అర్థం కాక పోయినా ఇస్సాకును తీసుకొని సామాగ్రిని, సేవకులను తీసుకొని బయలు దేరాడు. కొండ దగ్గరికి కాగానే సేవకులతో "మీరిక్కడ ఉండండి. మేము కొండపైకి వెళ్లి దేవుని మొక్కివస్తాము". అని ఇస్సాకును తీసుకొని కొండపైకి వెళ్లిపోయాడు. అక్కడికి వెళ్లే దాకా ఇస్సాకుకు ఇంకా డైలమా. అబ్రహాము కన్నా తెలుసు ఇస్సాకును బలి ఇవ్వాలని, కాని దీని వెనుక దేవుని ఆంతర్యం ఏమిటో ఆయనకు కూడ తెలియదు. ఇస్సాకుకు బలిపశువే తెలియదు. అక్కడికి వెళ్లిన తరువాత ఇస్సాకును పట్టుకొని చేతులు కట్టేసి బలిపీఠంపై కట్టేసాడు. బహుశ ఇస్సాకు పెనుగులాడి ఉంటాడు. "నాన్న! నువ్వేనా? నన్ను ఇంతగా ప్రేమించే నువ్వు ఈ స్థితికి ఎలా వచ్చావు?" అని అరచి ఉంటాడు. అబ్రహాము కత్తి ఎత్తాడు. ఒక్క క్షణంలో ఆ కత్తికి ఇస్సాకు బలి అయిపోతాడు. అప్పటి దాకా మౌనంగా ఉన్న దేవుడు "ఆగు" అన్నాడు. ఎందుకని దేవుడు కొండ ఎక్కక ముందు "ఆగు" అనలేదు. ఎందుకని దేవుడు ఇంటి దగ్గర నుండి బయలు దేరే ముందు "ఆగు" అనలేదు. ఎందుకని, దేవుడు ఇస్సాకును కట్టెల మీద వేసికడుతున్నప్పుడు "ఆగు" అనలేదు? కత్తి ఎత్తిన తరువాత ఎందుకని "ఆగు" అనలేదు. మరుక్షణం ఇస్సాకు ప్రాణం పోతుంది అనగా "ఆగు చంపకు" అన్నాడు. ఎందుకంటే దేవుడికి కావలసింది ఈ పడుకున్న ఇస్సాకు కాదు, అబ్రహాము గుండెల్లో తిష్టవేసుకున్నాడే ఆ ఇస్సాకు.

ఏ తండ్రి అయిన కొడుకును ఎప్పుడు చంపుతాడు? ఒక వేళ కొడుకును చంపవలసి వస్తే, ఎప్పుడు చంపగలడు? ఒక సారి ఆలోచించండి. ముందుగా గుండెల్లా కొడుకు పట్ల గల ప్రేమను చంపుకోవాలి. అబ్రహాము ఇస్సాకును గుండెల్లో చంపేశాడు. ఇక నాకు కొడుకు లేడు అనుకొని అప్పుడు కత్తి ఎత్తాడు. దేవుడికి కావలసింది ఏమిటి? గుండెల్లో ఉన్న ఇస్సాకు. అందుకే దేవుడు "ఆగు" అన్నాడు. మీరు చూడండి. బైబుల్ భాష ఎంత అద్భుతంగా ఉంటుందో, అబ్రహాము నిజమైన ఇస్సాకును చంపలేదు కాని యాకోబు 1,21లో ఏమని రాసాడంటే "అబ్రహాము ఇస్సాకును బలి ఇచ్చెను, అది అతనికి నీతిగా ఎంచబడెను". ఇచ్చాడా బలి? ఇస్సాకును అబ్రహాము బలి ఇచ్చాడా? మరి ఎందుకు యాకోబు అలా రాసాడు? బైబుల్‌లో అలా ఎందుకుంది వాక్యం తప్పు చెప్పుదుకదా! ఎక్కడ ఇచ్చాడు బలి? గుండెల్లో ఇచ్చాడు.

ప్రియ చదువరీ! ఈ రోజు దేవుడు నీ నుండి అదే కోరుకుంటున్నాడు. నీ గుండెల్లో విగ్రహంగా తిష్టవేసుకున్నదెవరు? నీకు నీ సృష్టికర్తకు మధ్యగా వస్తున్న వస్తువు ఏంటి? నీ గుండెల్లో తిష్ట వేసుకున్న వ్యక్తి ఎవరు? ముందుగా నీ గుండెల్లో తిష్ట వేసుకున్న దాన్ని చంపు, దేవుని వైపు తిరుగు, నీ గుండెల్లో ప్రథమ స్థానం దేవునికి ఇవ్వు. అదే నీ జీవితానికి ఒక టర్నింగ్ పాయింట్. అలా చేసి చూడు. ఈ రోజు అబ్రహాము స్థితి ఏమిటి? ఈ రోజు మూడు మతాల ప్రజలు అబ్రహామును "తండ్రీ" అని పిలుస్తున్నారు. మనం దేవుని కోసం తీసుకునే నిర్ణయాలు చరిత్ర గతిని మార్చేస్తుంది. చరిత్ర నిన్ను గుర్తు పెట్టుకుంటుంది. అలాంటి నిర్ణయం నువ్వు తీసుకోగలవా? యేసు ప్రభు యొక్క జన్మదినాన్ని జరుపుకుంటున్న మనం మన సృష్టికర్తకు మన హృదయాల్లో మొదటి స్థానం ఇద్దాం! ఆయన తర్వాతే అన్నీ! ఈ 2021 క్రిస్మస్ మన జీవితాల్లో మరపురాని క్రిస్మస్‌గా మిగిలిపోవాలి. సమస్త ఘనత చెందును గాక! ఆమెన్

---

## ధ్యాన కేంద్ర నిర్మాణము కొరకు ప్రార్థన

ప్రభువా, నీ నామ మహిమ కొరకు మరియు ఆదిలాబాద్ గురుపీఠంలో సువార్త వ్యాప్తి కొరకు నిర్మించబడుతున్న ధ్యానకేంద్రాన్ని ఆశీర్వదించండి. ఎటువంటి ఆటంకములు లేకుండా దానిని సకాలంలో పూర్తి చేయుటకు తద్వారా మీ సువార్తను ప్రకటించుటకు మాకు అనుగ్రహం దయచేయమని ప్రార్థించుచున్నాము. ఆమెన్.





# క్రీస్తు మరణోత్థానాలు
# మత్తయి 26-28 అధ్యాయాలు

మత్తయి క్రీస్తు మరణోత్థానాలను ఏకభాగంగా రచించాడు. క్రీస్తు శ్రమల ఘట్టంగా అతని ఠీవి ప్రస్ఫుటగా కన్పిస్తుంది. శ్రమల కాలంలో జరుగబోయే సంఘటనలన్నీ అతనికి ముందుగానే తెలుసు. అతడు వాటిని అదుపులో పెట్టుకొంటాడు కూడ. మరణంతో ప్రాతయుగం అంతరించి నూత్న జీవితం ప్రారంభమౌతుంది. ఉత్థానంతో ప్రాతయుగం అంతరించి నూత్న యుగం ప్రారంభమౌతుంది. యూదులు క్రీస్తుని నిరాకరించారు. ఇక శిష్యులు రక్షణ వార్తను అన్యజాతులకు ప్రకటిస్తారు. యూద సమాజానికి బదులుగా క్రైస్తవ సమాజం ఆవిర్భవిస్తుంది. ఇక్కడ మనం మొదట క్రీస్తు మరణాన్ని ఆ పిమ్మట అతని ఉత్థానాన్నీ పరిశీలిద్దాం.

## క్రీస్తు మరణం

మత్తయి సువార్త 26–27 అధ్యాయాలు క్రీస్తు శ్రమలనూ, మరణాన్నీ వర్ణిస్తాయి. ఇక్కడ 12 అంశాలున్నాయి. వీటిని క్రమంగా పరిశీలిద్దాం.

**1. క్రీస్తుపై కుట్ర :** క్రీస్తు శ్రమలు యూదులు పాస్క పండుగ జరుపుకొనే కాలంలో ప్రారంభమయ్యాయి. యూదనాయకులు ప్రభువులను బంధించి చంపించడానికి పథకం వేసారు. ఐతే అతనికి ప్రజాదరణం ఉంది. అతన్ని బంధిస్తే పండుగ రోజుల్లో క్రిక్కిరిసి ఉండే జనం తిరుగబడవచ్చు. కనుక యూద నాయకులు పండుగ ముగిసాక దొంగచాటుగా అతనిని పట్టుకొందామనుకొన్నారు. వారి దొంగబుద్ధి.

**2. బెతానియాలో అభిషేకం :** ఒక భక్తురాలు విందు భోజనాన్ని ఆరగిస్తున్న క్రీస్తు శిరస్సుని పరిమళ తైలంతో అభిషేకించింది. యూదులు మృతదేహాలకు పరిమళ తైలం పూసేవారు. అది వారు మృతులకు చేసే కరుణకార్యం. కనుక ఈ పుణ్యక్రియ ద్వారా ఈమె క్రీస్తు భూస్థాపనాన్నీ, మరణాన్నీ సూచించింది. కావుననే ప్రభువు ఆమెను మెచ్చుకొన్నాడు. ఆమె పేరు చిరస్థాయిగా ఉండిపోతుందని చెప్పాడు. ప్రధానార్చకుల కుట్రతోను యూదా ద్రోహంతోను పోలిస్తే ఈమె చేసింది కరుణ కార్యం. ఇది మనం పలుసార్లు ధ్యానం చేసికోదగ్గ మంచి సంఘటనం.

**3. గురుద్రోహం :** క్రీస్తు ధనాశను గర్హించాడు. కాని యూదా ఈ ధనవ్యామోహానాకి లొంగిపోయి గురువుని 30 కాసులకు అమ్మివేసాడు. అది పూర్వం ఒక బానిస వెల. అంత కొద్దిపాటి సొమ్ముకే అతడు ప్రలోభంలో చిక్కుకొన్నాడు. ఈనాడు మన పద్ధతిలో మనం కూడ ప్రభువుకి ద్రోహం చేస్తూనే ఉంటాం కదా! ఈ సంఘటనలు బుధవారం జరిగాయి.

**4. కడరాత్రి భోజనం :** ఈ సంఘటన గురువారం జరిగింది. ప్రభువు శిష్యులతో పాస్కభోజనం భుజిస్తున్నాడు. ఆ సందర్భంలో అతడు మీలో ఒకడు నన్ను శత్రువులకు పట్టిస్తాడు అని శిష్యులతో చెప్పాడు. ఈ ఒకడు యూదాయే. యూదా ఈ పని చేసేది నేనా అని అడుగ్గా ప్రభువు నీవే చెప్తున్నావు అన్నాడు - 26,25. అనగా ఈ పని చేసేది నీవేనని భావం. ఇక్కడ క్రీస్తుకి తన మరణ సంఘటనలు ముందుగానే తెలుసు అనుకోవాలి. తండ్రి యూదా దుష్టకార్యాన్ని గూడ తన రక్షణ ప్రణాళికకు అనుకూలంగా వాడుకొన్నాడు.

క్రీస్తు, గురువారం సాయంత్రం జరపించిన కడపటి విందులో తన శరీర రక్తాలను మనకు ఆహారంగా ఇచ్చాడు. ఇదే నేటి మన దివ్యసత్ప్రసాదం, మన దివ్యబలిపూజ. మనకు పాప పరిహారం చేకూర్చిపెట్టేది క్రీస్తు చిందించిన రక్తయేనని మనం తెలుసుకోవాలి. ఈ భాగం నూత్నవేదంలోని అతి పవిత్ర ఘట్టాల్లో ఒకటి.

**5. గెత్సెమనె :** గురువారం రాత్రి కడపటి విందు భుజించాక ప్రభువు శిష్యులతో గెత్సెమనె తోటకు ప్రార్థనకు వెళ్ళాడు. ఈ ప్రార్థనలో ముఖ్యాంశం క్రీస్తు దైవచిత్తానికి లొంగడం. అతడు తండ్రీ! ఈ పాత్రను నా నుండి తొలగించు. అయినా నీ చిత్తంకాని నా చిత్తం కాదు అని జపించాడు. ఇక్కడ పాత్ర అంటే సిలువ మరణమే. కష్టాల్లో మనం దేవుని చిత్తానికి లొంగాలి. ఇంకా అతడు శిష్యులతో మీరు శోధనకు గురికాకుండేటట్లు ప్రార్థించండి అని అన్నాడు. వారి శోధనం పాటుల కాలంలో క్రీస్తుని విడనాడటమే. క్రీస్తు ప్రార్థన ఘట్టం చాలా భక్తిమంతమైంది. మనం మోకాళ్లమీద వాలి చదువుకోదగ్గది.

**6. క్రీస్తు శత్రువుల చేతికి చిక్కడం :** గురుద్రోహి పాపపు ముద్దుతో క్రీస్తుని శత్రువులకు పట్టిఇచ్చాడు. యేసు అతనికి అడ్డుచెప్పలేదు. నీ పని త్వరగా కానీ అన్నాడు. 26,50. శత్రువులపై కత్తిదూసిన పేతురుని గూడ హింసకు పూనుకోవద్దని వారించాడు. అతడు పూర్వం పర్వత ప్రసంగంలోనే హింసను ఖండించాడు - 5,39.

**7. న్యాయపీఠం తీర్పు :** గురువారం రాత్రి శత్రువులు క్రీస్తుని బంధించి ప్రధానార్చకుడైన కయిఫా వద్దకు తీసుకొనిపోయారు. కయిఫా నీవు దేవుని కుమారుడవైన మెస్సీయావా అని అడుగ్గా క్రీస్తు నీవు చెప్పినట్లేనని జవాబిచ్చాడు. దీనికి ఔను నేను మెస్సీయానేనని భావం. అతడు మరణానంతరం తండ్రికి సరిసమానుడౌతాడు. లోకాంతంలో న్యాయాధిపతిగా తిరిగి వస్తాడు. యూదుల న్యాయపీఠం క్రీస్తు పలుకులను దేవదూషణంగా భావించి అతనికి మరణదండనం విధించింది.

**సశేషం....**

**(తరువాయి భాగం వచ్చే సంచికలో)**

"రండి రారండి ఎఫాతా ధ్యానకేంద్ర ప్రారంభోత్సవ వేడుకలలో పాల్గొనండి. దేవాది దేవుని దీవెనలు పొందండి"

# ఎఫాతా ధ్యాన కేంద్ర ప్రారంభోత్సవ వేడుకలు

## అందరికి హృదయపూర్వక ఆహ్వానము







**"నా ఆలయము అన్ని జాతి జనులకు ప్రార్థనాలయము అనబడును" (మార్కు 11,17)**

ప్రియ సహోదరీ సహోదరులారా, మన ఆదిలాబాద్ మేత్రాసనంలో ఒక ప్రార్థన ధ్యాన కేంద్రము నిర్మించాలన్నది మన చిరకాలపు అభిలాష. దేవుడు ఆ కలను "ఎఫాతా ధ్యానకేంద్రం" రూపములో సార్థకము చేసి ఉన్నారు. దేవునికి స్తోత్రం. ఆయన పవిత్ర నామమునకు మహిమ కలుగును గాక.

ప్రియులారా! దేవుని కృప మరియు మరియ తల్లి దీవెనల వలన దాతల సహాయం మరియు దైవజనుల ఎనలేని ప్రార్థనల ఫలముగా ఆదిలాబాద్ మేత్రాసనం యొక్క ఎఫాతా ప్రార్థన కేంద్రము నిర్మాణ పనులు పూర్తి కావించుకొని యున్నది. ఇట్టి ధ్యానకేంద్రం యొక్క ప్రారంభ వేడుకలు తేది : **6-01-2022** గురువారం రోజున నిర్వహించబడును. స్థలం : రెబ్బెన, అసిఫాబాద్ జిల్లా, తెలంగాణ.

**10.00 గంటలకు ప్రారంభోత్సవము**
**10.30 గంటలకు ధ్యానకేంద్ర ఆశీర్వాదము మరియు పవిత్ర దివ్యబలిపూజ**
**01. 00 గంటలకు ప్రేమ విందు**

కావున ఈ చారిత్రాత్మక మహోత్తర పవిత్ర కార్యక్రమములో పాల్గొని ఆ కరుణామయుని కృపాశీర్వాదములు పొందుకోవలసినదిగా హృదయ పూర్వకముగా ఆహ్వానించుచున్నాము.

బిషప్ ప్రిన్స్ అంతోని
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రానులు

రెవ. ఫా॥ కుర్యన్ పొన్మలకున్నెల్
ఎఫాతా ధ్యానకేంద్ర డైరెక్టర్

గమనిక : ఈ ప్రారంభోత్సవ వేడుకలకు జగద్గురువులు పరిశుద్ధ పాపుగారి భారత రాయబారులైన **శ్రీశ్రీశ్రీ మహాఘన లియోపోల్డొ జిరెల్లి, తెలుగు కతోలిక పీఠాధిపతులు**, మరియు ఎంతో మంది శ్రేయోభిలాషులు హాజరుకానున్నారు.



## పునీత ఫ్రాన్సీస్ జేవియర్ (శౌరి)
## (గురువు, ఆసియా ఆశాజ్యోతి, విదేశీ వేదప్రచారకుల పాలక పునీతులు మతసాక్షి, క్రీ॥శ॥ 1506 – 1552)

ప్రతి కాలంలో కూడ ప్రభువు అపోస్తలులకు ఇచ్చిన ఆజ్ఞ ప్రకారం ప్రపంచ నలుదిసల గల సుదూర ప్రాంతాలకు పోయి సువార్తను బోధించి విస్తారంగా క్రీస్తును తెలియని ప్రజానీకాన్ని క్రీస్తు రాజ్యంలో ఆహ్వానించి, ఎందరో మహానుభావులు వీరోచితంగా పయనించి, బోధించి ఘోర అపాయాల నుండి తప్పించుకొని లేక తప్పించుకోలేక తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు. పునీతులయ్యారు. ఉత్సాహంతో శ్రమించి ఇట్టి కోవలో స్థానం సంపాదించినవారే జెస్విట్ గురువు ఫ్రాన్సీస్ శౌరిగారు. 10వ పయస్ (భక్తినాథ) పోపుగారి మాటల్లో విశ్వాస వ్యాపకానికి సాధికార విదేశీ మెషినరీలకు పాలక పునీతులు ఈ శౌరిగారు. వీరు గొప్ప ఆధునిక సువార్త ప్రచారకులు. భారత్‌లోని పశ్చిమ, దక్షిణ ప్రాంతాలు హిందూ మహాసముద్రంలో ఉన్న బారత్‌కు చెందిన ద్వీపాలు, జపాను దేశంలో కూడ క్రైస్తవాన్ని బలంగా ప్రాదుగొల్పిన మీరు చైనా ప్రజలకు కూడా బోధింప చేసిన ప్రయాణంలో వీరు సాహసమరణం పొందారు.

ఫ్రాన్సీస్ జేవియర్ గారు స్పెయిన్ దేశంలో 1506 ఏప్రిల్ 7న జన్మించారు. ఫ్రాన్సీస్ నామధేయులయ్యారు. వీరు పురాతనమైన జేవియర్ (శౌరి) అనే కోటలో పుట్టారు కాన ఫ్రాన్సీస్ జేవియర్ అని పేరు వచ్చింది. వీరిది ధనవంతుల కుటుంబం. తల్లి అజ్‌పిల్ క్వెటావంశజురాలు కాగా, తండ్రి నవర్రె రాజ్యంలో కౌన్సిలరైన డాన్ జ్వాన్ దె జస్సో వీరికి గల చాలా మంది పిల్లల్లో ఫ్రాన్సీసు గారు కడపటివారు. ఫ్రాన్సీసు గారి అన్నలిద్దరు దేశ రక్షణ సైన్యంలో యుద్ధవీరులు. కాని వారి సైన్యం యుద్ధంలో ఓడింది. శత్రువులు జేవియర్ కోటను ముట్టడించి పగ ద్వేషంతో దాన్ని నేలమట్టం చేశారు. ఏవోకొన్ని గదుల్ని మాత్రం వదిలేశారు. అక్కడే వశిస్తూ తండ్రి దిగులుతో మరణించగా పిల్లల పెంపకం ముఖ్యంగా తెలివిగల వాడైన ఫ్రాన్సీసును పెద్ద చదువుల్లో పెంచాల్సిన బాధ్యత తల్లిపై పడింది.

ఫ్రాన్సీస్ పెరిగి పెద్దవాడయ్యాడు. గుర్రపు స్వారీ, కుస్తీ, ఈత, ఈటె విసరడం, వ్యాయామం ధైర్యసాహసాలు ప్రదర్శించడంలో శ్రద్ధ. అలాగే కష్టపడి చదివేవారు. తల్లి సద్భోధలవల్ల తోడి విద్యార్థుల్లా దొంగతనంగా థియేటర్లకు వెళ్ళడం, తరగతులు తరచుమానడం, జూదము, మద్యపానము చేయడం వంటి దుర్వసనాలకు లోనుకాలేదు. బుద్ధిగా చదువుకుని ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణుడై విద్యార్థుల, ఉపాధ్యాయుల

అభిమానాన్ని చూరగొన్నాడు. పెద్ద చదువుల కోసం ఫ్రాన్సులోని ప్రసిద్ధ విశ్వవిద్యాలయంలోని పునీత బర్బరా కళాశాలలో చేరి క్రీ।।శ।। 1530లో యం.ఏ. పట్టాపుచ్చుకున్నారు. అదిస్టాటిల్ తత్వశాస్త్ర బోధకునిగా అదే విశ్వవిద్యాలయంలో సేవలందించారు కూడ.

అయితే వీరు గొప్ప చదువులు చదవుతుండగా తన విద్యాకాలంలో గర్వందర్పం చోటుచేసుకున్నాయి. వారి దృష్టంతా ఉన్నత పదవి, అంతస్థు, గౌరవం, సిరి సంపదలపైనే నిలిచింది. విలాసవంతమైన జీవితంవైపు మొగ్గుచూపసాగారు. అయితే వీరి గదిలో తన కన్నా పదిహేను సంవత్సరాల పెద్ద అయిన మరో విద్యార్థి ఉండేవారు. గతంలో సైనికుడిగా పనిచేసి యుద్ధంలో కాలు విరుగగొట్టుకున్నవారు. వీరునూ గొప్ప సైన్యాధినేతయై పేరు ప్రతిష్ఠలకై కలలుగన్నవారే ఇప్పుడు మారు మనస్సు పొంది దైవ సేవకు ఆరాట పడుతున్నారు. పేరు ఇగ్నేషియస్ (ఇన్యాసి) లొయోల. “ఒక వ్యక్తి లోకాన్నంతా సంపాదించి తన ఆత్మను మాత్రం కోల్పోతే ఏం ప్రయోజనం?” అని పదే పదే పలికి ఫ్రాన్సీస్ గారికి క్రీస్తు విశ్వాసంలో క్రీస్తు సేవలో నమ్మకం కుదిర్చారు. అందువల్ల ఈ లోక ఆశలపై వ్యామోహం తగ్గి తన మహిమ కోసం గాక దేవుని మహిమ కోసం, దేవుని సేవ కోసం జీవితమంతా శ్రమించాలని ఫ్రాన్సీస్ నిశ్చయించుకున్నారు. వీరితో పాటు దేవుని సేవ కోసం ఇష్టపడే మరో అయిదుగురు యువకుల్ని కూడ ఇగ్నేష్యస్ గారు తమ మిత్రబృందంలో చేర్చుకున్నారు. వారంతా లోకాన్ని త్యజించినట్లు గుర్తుగా ఒక నిలువటంగీని ధరించి, చేత ఊతకర్రను పట్టుకున్నారు. ఒక రోజు ఉదయం ప్యారిస్ నగరం వెలుపల ఉన్న కొండనెక్కి వెళ్లారు. అచటగల దేవాలయంలో ప్రార్థించి వారంతా పేదరికం, పాతివ్రత్యతా బ్రహ్మచర్యం, విధేయతలను జీవిత పర్యంతం పాటిస్తూ దేవుని సేవిస్తూ ప్రజలకు సేవ చేస్తామని దీక్షగైకొన్నారు. ఈ విధంగా క్రీ।।శ।। 1534లో ఈ ఏడుగురు బృందంతో ‘యేసు ప్రభ’ ఆవిర్భావానికి నాంధి జరిగింది.

కొంతకాలమయ్యాక ఇగ్నేషియస్, ఫ్రాన్సీస్ వారి సహచరులు కాలినడకన రోము వెళ్లి పోపుగారిని కలిసి తమ సభ నియమావళిని సమర్పించి ఆమోదం పొందారు. ఆనాటి 3వ పౌలు పోపుగారు వారంతా గురుపట్టమొంద అనుమతినిచ్చారు. ఫ్రాన్సీసు గారు 1537 ఆగస్టు 15న వెనిస్ నగరంలో తమ 31వ ఏట గురుపట్టాభిషిక్తులయ్యారు. తమ ప్రథమ దివ్య బలిపూజ అర్పించినప్పుడు వారికళ్లు ఆనందంతో చెమ్మగిల్లాయి వారు ఆస్పత్రిలో రోగులకు సేవ చేస్తూ గడిపారు.

అయితే ఆ కాలంలో పోర్చుగల్ రాజు సువార్తా ప్రచారంతో శ్రీసభ వ్యాపకం కోసం తూర్పు దేశాల నుండి కొంతమంది బోధక గురుల్ని పంపమని రోమునగర రాయబారి ద్వారా ఇగ్నేషియష్‌కు వర్తమానం పంపగా అందుకు రోడ్రిగ్వస్, బోబడిల్లా గురువులను ఎంపిక చేశాడు. సుదీర్ఘ ప్రయాణం చేసి రోమునగరం చేరుకున్న బోబడిల్లా గురువు అస్వస్థుడు కాగా మరో మార్గం లేక ఇగ్నేషియస్ (ఇన్యాసి) వారు ఫ్రాన్సీస్ శౌరిగారిని పంప నిశ్చయించారు. ఒక్క రోజునే తన సామాను సర్దుకుని 1540 మార్చి 16న ఫ్రాన్సీస్ రోమును వీడి పోర్చుగల్ వెళ్లాడు. రెండేళ్ల తర్వాత అక్కడ నుండి 1541 ఏప్రిల్ 7న ఫ్రాన్సీసు వారి 35వ జన్మదినం రోజున ఓడలో ప్రయాణమై 1542 మే 6న గోవాపట్టణంలో తన పవిత్ర పాదం మోపారు.

**(తరువాయి భాగం వచ్చే సంచికలో)**

# శుభవచనం బైబిల్ క్విజ్

**యిర్మీయా గ్రంథము 1-26 అధ్యాయాలు**

పేరు ..........................ఇంటి పేరు.......................విచారణ ............................

ఫోన్ నెంబర్.................................

## I. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి

1) నేను నీకు తోడుగా నుండి నిన్ను .........................................................

2) నీవు నన్ను ........................................................ నేను సంపూర్ణ రక్షణమును బడయుదును.

3) అతడు ............................................................ న్యాయము జరిగించెను.

4) దేశమందంతట ............................................................ నెలకొల్పును.

5) ఆపదలో నీవు నాకు ........................................................................ .

6) నర మాత్రుని మీద ........................................................... శాపగ్రస్తుడు.

7) నా ...................................................................... ప్రమోదము చేకూర్చెను.

8) నీవు నీ ..................................................................... ఒప్పుకొనుము.

9) ................................................................... నగరము సుందరమైనది.

10) నేను కరుణతోను ................................................................ భూమిని ఏలుదును.

11) వారు ........................................................................... నా వద్దకు తిరిగి వత్తురు.

12) నేను ..................................................... లందంతట ఉండువాడను.

13) ....................................................... ఆకసమును విశాలముగా విప్పెను.

14) నేను ఎన్నుకొనిన ప్రజలు ....................................................... పక్షివంటి వారైరి.

15) ఆకసము ............................................................... జల్లులు కురియింపలేదు.

16) కనుక మీరు మీ ........................................., ........................................ మార్చుకొని ప్రభువునకు విధేయులు కండు.

17) ............................................................. నగరములు మూయబడెను.

18) మీరు నా ....................................., ............................................విని వానిని పాటింపుడు.

19) ప్రవక్తలు యాజకులు కూడ .......................................... ఒడిగట్టుచున్నారు.

20) పరదేశులకును,........................................., ......................................... పీడింపకుడు.

21) మీరు మీ .................................. ను రాయి చేసికొని ................................ పడరైతిరి.

22) నేను నీకు ............................................ నుండి నిన్ను కాపాడుదును.

23) నీ హృదయము నుండి .................................... కడిగి వేసుకొని ............................బడయును.

24) మీరు ...........................................................................కు వెళ్లిచూడుడు

25) నేను వారిని తిరిగి ....................................................................... కొని వత్తును.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ జనవరి నెల 15వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: యిర్మీయా గ్రంథము 27-52 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు

"నేను ద్రాక్షావల్లిని, మీరు రెమ్మలు. ఎవడు నా యందు ఉండునో, నేను ఎవనియందు ఉండునో అతడు అధికముగ ఫలించును. ఏలయన, నేను లేక మీరు ఏమియు చేయజాలరు" (యోహాను 15,5). యేసయ్యతో పాటు ఉంటేనే ఫలింపగలనని తెలిపే ఈ చిత్రాన్ని రంగులమయం చేద్దాం.



**పేరు:...............................వయస్సు.......తరగతి.......స్థలం................**

<u>సూచన :</u>

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ జనవరి నెల 15వ తేదీలోపు మాకు పంపించాలి.



# "పిల్లలూ! యేసయ్య మిమ్ములను పిలుస్తున్నాడు"

"ఆ వాక్కు మానవుడై మన మధ్య నివసించెను. మేము కృపా సత్యములతో నిండిన ఆయన మహిమను చూచితిమి. అని తండ్రి యొద్ద నుండి వచ్చిన ఏకైక కుమారుని మహిమ" (యోహాను 1,14)

**ప్రియమైన చిన్ని బిడ్డలారా!**

మనం క్రీస్తు జయంతి పండుగను కొనియాడుటకు సిద్దమవుతున్నాము. మరియ తల్లి దేవుని సందేశాన్ని విన్నది ఆమె దేవుని వాగ్దానము తన జీవితంలో నెరవేరాలని హృదయ పూర్వకంగా కోరుకుంది. ఆ వాక్యాన్ని ధ్యానించింది. ఆమె తన గర్భంలో ఆ వాక్యం శరీరాన్ని రూపొందించుటకుగాను ఇమ్మానువేలు దేవునికి జన్మనిచ్చింది. ఆ వాక్కు మానవుడై మన మధ్య నివసించే గొప్ప కృపను, సత్యాన్ని ఆ మహిమను ఈ లోకం అనుభవించటానికి ద్వారం అయ్యింది.

బాలయేసు మన మధ్య నివసించటానికి మన మొక్కొక్కరం ద్వారం కావాలి. ఏం చేస్తే ఇది సాధ్యమవుతుంది. మనం దేవుని వాక్యాన్ని పఠించాలి, ధ్యానించాలి. మన సొంతం చేసుకోవాలి. అప్పుడు మనమే బాలయేసు యొక్క చిట్టి చేతులు అవుతాం. మన కుటుంబంలో మన సమాజంలో దేవుని కృపను, సత్యాన్ని, మహిమను చూపించే తోక చుక్కలా మరాలి. ఈ క్రిస్టమస్ పండుగకు మనం దేవుని వాక్యాలను 25 రోజులు జాగ్రత్తగా ఉత్సాహంగా ప్రేమతో నేర్చుకుని అనేక మందికి మన మొక్కొకరం బాలయేసుని తెలుసుకోవటానికి ప్రేమించటానికి ఆయన మహిమను సాక్షాత్కరించటానికి దేవుని చిన్న దూతలమవుదాం. చిన్నారి బాలయేసుకి మనమిచ్చే పుట్టిన రోజు కానుక ఇదై ఉండాలి. బాలయేసు ఎక్కడో పుడితే కాదు క్రిస్టమస్. మన హృదయంలో పుడితేనే క్రిస్మస్ అవుతుంది.

బాలయేసు మిమ్ము దండిగా మెండుగా దీవించునుగాక!



# బాలయేసుని స్వీకరించడం ఎలా

క్రీస్తునాథుని యందు ప్రియ దేవుని బిడ్డలారా, సకల జాతి జనులు లోక రక్షకుని జన్మదినోత్సమును కొనియాడడం కోసం సిద్ధమవుతున్న ఈ తరుణంలో రక్షకుడైన క్రీస్తును స్వీకరింప మన హృదయాలను సిద్ధపరచుకోవాలి. లోకరక్షకుడైన క్రీస్తు, మానవునిగా జన్మించి, పాపం అనే ఊబిలో పడియున్న మనల్ని పాపాంధకారము నుండి ప్రకాశ మార్గములోనికి నడిపించుటకు వెలుగుగా ఈ లోకానికి అవతరించనున్నాడు. ఆ వెలుగు మన హృదయంలోకి రావాలంటే బాలయేసు, మన హృదయంలో జన్మించాలి. బాలయేసు మన హృదయంలో జన్మించాలంటే మనం, చేసిన పాపాలకుగాను ప్రాయశ్చిత్తం చెంది, మారు మనస్సు పొంది నూతన వ్యక్తులుగా జీవించడానికి ప్రయత్నించాలి. లోకరక్షకుని స్వీకరించడానికి సిద్ధపడుతున్న ఈ శుభ తరుణంలో ముందుగా లోక రక్షకుడు ఎవరు అని మనం ధ్యానించుకోవాలి.

**లోకరక్షకుడు ఎవరు?**

– లూకా 2,11 "నేడు దావీదు నగరమున మీకు ఒక "రక్షకుడు" పుట్టెను. ఆయన క్రీస్తు, ప్రభువు".

– మత్తయి 1,21 "ఆమె ఒక కుమారుని కనును. నీవు ఆయనకు 'యేసు' అను పేరు పెట్టుము. ఏలయన ఆయన, తన ప్రజలను వారి పాపముల నుండి రక్షించును" అని చెప్పెను. యేసు అను పేరుకు అర్థం రక్షించువాడని. అందుకే మత్తయి 1,21వ వచనంలో ఈ విధంగా వివరించబడింది. "ఆయన తన ప్రజలను వారి పాపముల నుండి రక్షించును".

– లూకా 2,11 " నేడు దావీదు నగరమున మీకు ఒక రక్షకుడు పుట్టెను. ఆయన క్రీస్తు ప్రభువు అని వచనంలో గమనిస్తున్నాము.

– యోహాను 4,42 "సమరియ స్త్రీ యేసుని గురించి చెప్పినప్పుడు, ఆ పట్టణములోని సమరీయులు అనేకులు ఆయనను గురించి ఈ విధముగా సంభోదించారు. 'వాస్తవముగ ఆయన లోకరక్షకుడని" మాకు తెలియును.

– అపోస్తుల కార్యము 13,23 "దేవుడు తాను వాగ్దానము చేసిన ప్రకారముగా దావీదు వంశీయుడైన 'యేసును' యిస్రాయేలు ప్రజలకు రక్షకునిగా చేసెను.

ప్రియ సహోదరీ సహోదరులారా! పునీత యోహాను గారు ఎలాగైతే లోక రక్షకుని రాకడ గురించి, బోధించారో మనం కూడా ఆ లోక రక్షకుని జన్మదినోత్సవమును ప్రపంచ నలుమూలల సంతోషంతో, ఆనందంతో తెలియపరచాలి.

యేసు ప్రభు ఒక సామాన్యమైన వ్యక్తి. పేదవాడిగా జన్మించాడు. "ఆయన తన్నుతాను రిక్తుని చేసుకొని సేవక రూపమును దాల్చి మానవ మాత్రుడుగా జన్మించెను" (ఫిలిప్పీ 2,6). ఆయన దైవత్వాన్ని విడిచి మానవ రూపాన్ని దాల్చాడు. లూకా 4,18-19లో ధ్యానించినట్లుగా, బీదల కొరకు అనాథల కొరకు శోకార్తుల కొరకు ఈ లోకానికి వచ్చారు. పేదవారి మనసు సున్నితమైనదిని ఒక పేదవానిగా ఇల్లు, వాకిలి, కూడు, గుడ్డ ఏమిలేనివానిగా నిరుపేదగా జన్మించారు. అందుకే ప్రభువు ఇలా అంటున్నారు. "దీనాత్ములు ధన్యులు దైవరాజ్యము వారిది అని".

బాలయేసుని జన్మ దినోత్సమునకు సిద్ధపడుతున్న ఈ సమయంలో మనల్ని మనం ప్రశ్నించుకోవాలి.

–మానవుల మధ్య జన్మించకుండ, పశువుల పాకలో ఎందుకు జన్మించారు?

– అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికి ఏమిలేని వానిగా ఆయన ఎందుకు జన్మించారు?

యేసు ప్రభు ఈ లోకానికి రక్షణ ఇవ్వడానికి, సకల జాతి జనులకు పాపవిమోచనం కలుగజేయుటకు, మరియు తన బిడ్డలు సైతాను మార్గములో నడవకుండా హృదయపరివర్తనం చెంది, త్యాగపూరితమైన జీవితం జీవించాలని కోరుతున్నారు. చిన్నారి బాలయేసు కన్యమరియ గర్భాన ఉదయించి మానవునిగా ఈ లోకంలోకి అడుగిడి, మంచిని ప్రబోధించడానికి, మానవులకు నూతన మార్గాన్ని చూపించడానికి, మరియు స్వేచ్ఛా స్వాతంత్ర్యములు ప్రసాదించడానికే యేసు ఈ భూమిపై మానవరూపమెత్తి ఈ లోకానికి రక్షకునిగా సుప్రసిద్ధుడయ్యాడు. యేసు భూమి మీద తన రాజ్యాన్ని నిర్మించడానికి రాలేదు కాని, మనుష్యుల హృదయాల్లో రాజ్యాన్ని ఏర్పరచుటకు వచ్చారు. బాలయేసుని మన హృదయాల్లో స్వీకరించాలంటే, మన హృదయంలోనన్ను అహంకారం, గర్వం, పగ, ద్వేషం, అసూయ, మరియు ఇతర విధములైన చెడు ఆలోచనల నుండి దూరమైతేనే తప్ప బాలయేసుని స్వీకరించలేం. మరిముఖ్యంగా పాపం అనే అడ్డుగోడను తొలగించాలి. ఈ ఆధునిక కాలంలో యువకులెవ్వరు పరిశుద్ధ జీవితం జీవించడానికి ఇష్టపడడం లేదు. దేవుని సువార్తను బోధించడానికి ప్రతి యువతి యువకులు ముందుకు రావాలి. నేటి సమాజంలో ఉన్న యువతి యువకులకు ఎన్నో నైపుణ్యాలు ఉన్నాయి. వాటిని మంచికే ఉపయోగించాలి కాని చెడుకు కాదు.

కాబట్టి దేవునికి ప్రీతికరమైనవి చేస్తూ, పరిశుద్ధ జీవితము జీవిస్తూ, త్యాగపూరితమైన జీవితాలతో బాలయేసుని స్వీకరించడానికి మన హృదయాలను సిద్ధపరచుకుందాం! చిన్నారి బాలయేసుని అనుగ్రహాలు మన కుటుంబంలో నిండుగా, మెండుగా కుమ్మరించుమని ప్రార్థించుకుందాం.

# బైబిల్ దృశ్యమాలిక


జోసఫ్ అన్నలకు విందు భోజనం చేశాడు.
!!
మరునాడు ధ్యానంతో వారు బయలుదేరారు. ఎవరి డబ్బు వారి సంచిలో ఉంచి బెంజిమన్ సంచిలో తన వెండి పళ్ళెం ఉందమన్నాడు జోసఫ్
అమ్మయ్య తండ్రి చాలా సంతోషిస్తాడు
అవును
అదిగో! సైనికులు వస్తున్నారు......
???
???


మీరు దొంగలు.
మా రాజుగారి వెండి పళ్ళెం
దొంగలించారు.
మీరు
ఏమంటున్నారు?
మీలో వెండి పళ్ళెం
దొంగిలించింది
ఎవరు?
వెండి పళ్ళెం బెంజిమన్ సంచిలో ఉంది.
ఏయ్
నడువ్!
!!!!
?
జోసఫ్ తన అన్నలతో........
మీరు
నేరస్తులు.
!
మేము నిర్దోషులం.
అయినా మీరు విధించే
శిక్షకు సిద్ధంగా ఉన్నాము.

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

**యెషయా గ్రంథము 45-66 అధ్యాయాలు**

1) తల్లి కుమారుని ఓదార్చినట్లు (66,13)

2) సత్యము (59,15)

3) ప్రభువైన దేవుడు (50,5)

4) అన్యాయపు బంధములను విప్పుడు. ఇతరుల మెడమీద కెత్తిన కాడిని తొలగింపుడు. పీడితులను విడిపింపుడు (58,6)

5) ఇస్రాయేలు దేవుడు (45,3)

6) నోవా (54,9)

7) అన్యదేశీయులు (61,5)

8) సకల జాతి జనులకు (56,7)

9) శీఘ్రమే (46,13)

10) మన దేవుని (52,10)

11) ధర్మబద్ధముగా, శాంతిని (57,2)

12) ప్రభువు, అద్భుత (63,7)

13) మట్టిమి, కుమ్మరివి (64,8)

14) మాతృగర్భమున, ప్రభువు (49,5)

15) విశ్రాంతి (58,13)

16) న్యాయము, నీతి (59,14)

17) సేవించు (65,8)

18) నీళ్లు వెలువడునట్లు (48,21)

19) శాశ్వతమైన (55,3)

20) నీ హృదయము (60,5)

21) పాపముల (53,5)

22) కీర్తి, కోపము (48,9)

23) విజయమును (51,5)

24) వృద్ధులను (47,6)

25) ఆకలిగొనిన (58,10)

**వచ్చే నెల పాఠ్యాంశం: యిర్మీయా గ్రంథము 27-52 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/–

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/–

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/–

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**రచయితలారా, గమనించండి! వెంటనే రచనలు పంపండి!**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.** అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**మా అడ్రస్**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల – 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswarammagazineadb@gmail.com